క్లుప్తంగా

ఘనంగా లక్ష బిల్వార్చన



బిల్వార్చన కార్యక్రమంలో భక్తులు

షాద్‌నగర్: శ్రావణ మాసం ముగింపును పురస్కరించుకొని పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో శనివారం రాత్రి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఏటా శ్రావణ మాసం ముగింపు రోజున లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, కార్యదర్శి నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.

శ్రావణమాసం ముగింపు పూజలు



ఊరేగింపులో భక్తులు

చేవెళ్ల: శ్రావణమాసం ముగింపు సందర్భంగా ఆదివారం దేవునిఎర్రవల్లిలో హనుమాన్ జయంత్రి పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో భజన మండలి భక్తులు భజనలు కొనసాగించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఉట్టికొట్టారు. అనంతరం అన్నదానం చేశారు.

పోరాట యోధుడు సురవరం



సురవరం మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్: పీడిత ప్రజల కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం అన్నారు. ఆదివారం నగరంలో సుధాకర్‌రెడ్డి మృత దేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే సురవరం అభ్యుదయ భావాలతో ముందుకు నడిచాడని, తుదిశ్వాస వరకు ఎంచుకున్న మార్గాన్ని వీడలేదని పేర్కొన్నారు. నాయకులు జంగయ్య ఉన్నారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి



పార్టీలో చేరిన వారికి కాషాయ కండువా కప్పుతున్న ఎంపీ

షాబాద్: స్థానిక ఎన్నికల్లో మండలంలో బీజేపీ జెండాను ఎగురవేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సర్దార్‌నగర్ మాజీ ఎంపీటీసీ బంగారంపల్లి అనిత తదితరులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. ఎంపీ కాషాయ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం కొండా మాట్లాడుతూ.. షాబాద్ గడ్డ బీజేపీ అడ్డాగా కావాలని, స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్‌లు అన్ని స్థానాల్లో పోటీ చేసి గెలుపొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, హరీశ్, మహేందర్, శేఖర్, రమేష్, అనిల్‌రెడ్డి, భవదీష్, రమేష్, రామస్వామి, నరేష్, రమేష్, జంగయ్య, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం నూతన కమిటీ నియామకం

కందుకూరు: లేమూరులో కురుమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఆ గ్రామంలో సంఘం మండల అధ్యక్షుడు అచ్చన పాండు, జిల్లా నాయకుడు ఎగ్గిడి సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. సంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా రావిచెట్టు రవీందర్, ప్రధానకార్యదర్శిగా కడారి మహేందర్, యూత్ అధ్యక్షుడిగా పల్లె శ్రీధర్, ప్రధానకార్యదర్శిగా చిట్టె రాజేందర్‌లను నియమించారు. కురుమలు అన్ని రంగాల్లో రాణించేలా ఒకరినొకరు సహకరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బండ ఆంజనేయులు, ఎగ్గిడి జగదీష్, మోటె రమేశ్, గజాడి మహేందర్, గజాడి మల్లేశ్, రావిచెట్టు వెంకటేశ్, ఇమిడి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సహజసిద్ధం.. సప్తవర్ణం



రంగుల్లో మట్టి ప్రతిమలు

ఆకట్టుకుంటున్న మట్టి గణపతులు

చవితి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పర్యావరణ హిత మట్టి గణపతి విగ్రహాలకు డిమాండ్ ఏర్పడింది. పూర్తిగా మట్టితో విగ్రహాలను తయారు చేసినప్పటికీ.. ఆకట్టుకునే విధంగా వాటికీ రంగులు అద్ది విక్రయిస్తుండటం గమనార్హం. చిలుకూరులోని ఓ మట్టి గణపతుల తయారీ కేంద్రంలో 4 అంగుళాల నుంచి 7 అడుగుల వరకు కోల్‌కతా నుంచి తెచ్చిన మట్టితో ప్రతిమలను తయారు చేస్తున్నారు. కొన్నింటిని అక్కడే తయారు చేసి తీసుకొస్తున్నారు. విగ్రహాల సైజును బట్టి రూ.25 నుంచి రూ.20 వేల వరకు అమ్ముతున్నామని తయారీ దారులు తెలిపారు. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలను నగరంతో పాటు వివిధ ప్రాంతాల వ్యాపారులు హోల్‌సెల్ ధరలకు తీసుకెళ్లి, వారి ప్రాంతాల్లో విక్రయిస్తుండటం గమనార్హం. - మొయినాబాద్



ఆకట్టుకుంటున్న విఘ్నేశ్వరుడు

మట్టి గణపతులను పూజిద్దాం

- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో సత్య శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. హిందూ సంప్రదాయాల్లో గణపతి పూజకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి శుభకార్యానికి ముందు గంగ పుత్రుడికి పూజ చేసే ఆచారం ఉందని చెప్పారు. చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు ఏర్పడనుందని, మట్టి ప్రతిమలను నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌కుమార్, సత్యనారాయణ, కరుణాకర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీనివాసులు, ప్రకాష్, రవికుమార్, వంశీకృష్ణ, అశోక్, మురళీ, ప్రవీణ్, శ్యామ మహేశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలను పంపిణీ చేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి

తంగడపల్లిలో గ్రామోత్సవం

చేవెళ్ల: సత్యసాయిబాబా చూపిన మార్గాలు అందరికీ ఆదర్శమని శ్రీ సత్యసాయిసేవా సంస్థ చేవెళ్ల సభ్యులు అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలో ఆదివారం సేవా సంస్థల ఆధ్వర్యంలో సత్యసాయి గ్రామోత్సవం నిర్వహించారు. సాయి శత జయంతిలో భాగంగా కార్యక్రమాలు చేపట్టామని సభ్యులు పేర్కొన్నారు. సంకీర్తనలతో పల్లకీ సేవ చేశారు.

నాణ్యతగా ఇంటిని నిర్మించుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్‌భరత్
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్: ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీమ్‌భరత్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీసతీష్‌లు అన్నారు. మండల పరిధి ఎత్‌మార్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల ఇళ్లను వారు ఆదివారం పరిశీలించి మాట్లాడారు. ఇంటి నిర్మాణ విషయంలో నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. లబ్ధిదారులకు ఇవ్వనున్న రూ.5 లక్షల నిధుల్లో విడతల వారీగా వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుందని తెలిపారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క నిరుపేదకు ఇంటిని నిర్మించి ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పేదోడి సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ ఎంపీటీసీ కేబుల్ రాజు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఫిషర్‌మెన్ మండల చైర్మన్ భిక్షపతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, మీనాజుద్దీన్, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలి

బీసీ జేఏసీ చైర్మన్ శ్రీనివాస్

షాద్‌నగర్: పార్లమెంట్ సమావేశాల్లో బీసీల 42శాతం రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని బీసీ జేఏసీ షాద్‌నగర్ చైర్మన్ టీజీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా హక్కుల సాధన కోసం పోరాటం చేశామని తెలిపారు. బీసీలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా పూర్తిగా వెనుకబడే ఉన్నారని పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లును ఆమోదించి, బీసీల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా టీజీ శ్రీనివాస్, కన్వీనర్‌గా రవీంద్రనాథ్, కోఆర్డినేటర్‌గా నర్సింలుగౌడ్, వైస్ చైర్మన్లుగా బాస వరలక్ష్మి, సురేష్‌కుమార్, కో–కన్వీనర్లుగా కరుణాకర్, వెంకటేశ్, శేఖర్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్‌లను నియమించారు. సమావేశంలో నాయకులు నర్సింహులు, రఘునాథ్ యాదవ్, రాఘవేందర్, వెంకటరమణ, బాల్‌రాజ్, రాము, మల్లేశ్, జనార్దన్, అర్జునప్ప, శివకుమార్, కోట జనార్దన్, శ్రీశైలం, రమేష్, చంద్రశేఖర్, మేకల వెంకటేశ్, శంకర్, జలజ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఉద్యమకారుల పోస్టు కార్డుల ఉద్యమం



ఉత్తరాలను పోస్టు చేస్తున్న ఉద్యమకారులు

మొయినాబాద్: తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులు పోస్టు కార్డుల పోరాటం మొదలు పెట్టారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఉత్తరాలు రాశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం వాటిని పోస్టు చేశారు. ఎన్నికల్లో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలనెలా పింఛన్ ఇస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా హామీలను అమలు చేయడం లేదని, వెంటనే మాట నిలబెట్టుకోవాలని ఉత్తరంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, ఉపాధ్యక్షుడు కుమ్మరి రమేష్, మండల అధ్యక్షుడు మహిపాల్, ఉద్యమకారులు మధు, రత్నం, ముకుందరెడ్డి, బన్సీలాల్, వెంకటయ్య, భాస్కర్, భిక్షపతి, కృష్ణ, నర్సింహులు, అవినాష్ తదితరులు ఉన్నారు.

క్లబ్ సేవలను విస్తృతం చేయాలి

షాద్‌నగర్: సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ సభ్యులు మరింత విస్తృతం చేయాలని క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో మొక్కలు నాటారు. మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. బుగ్గారెడ్డి గార్డెన్‌లో వికలాంగునికి ట్రిస్కూటీ, మహిళకు కుట్టు మిషన్, ముగ్గురు పేద విద్యార్థులకు సైకిళ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. సంపాదనలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శరత్‌చంద్రబాబు, మదన్‌మోహన్ రెడ్డి, మామిడి భీంరెడ్డి, రవికుమార్, అంజయ్య, రామకృష్ణారెడ్డి, రంగయ్య, శ్రీనివాస్, రాజేష్, సతీష్, వెంకటేశ్, నర్సింహారెడ్డి, వెంకట్ నాయక్, సందీప్, మురళీ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న క్లబ్ సభ్యులు

బీసీసేన గ్రామ కమిటీ ఎన్నిక



నూతన సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న బీసీ నాయకులు

షాబాద్: బీసీసేన గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు బాలరాజ్, యువజన అధ్యక్షుడు అజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో కేసారం గ్రామంలో నూతన అధ్యక్షుడిగా సుభాష్‌చంద్ర, ఉపాధ్యక్షుడిగా చాకలి రవి, ప్రధాన కార్యదర్శిగా మంగలి చంద్రశేఖర్, కార్యదర్శిగా మహమ్మద్ ఖాసీంలను నియమించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ అధ్యక్షుడు బర్కకృష్ణ మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం 45 ఏళ్లుగా ఆర్.కృష్ణయ్య పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా రేపు జరగబోయే ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్షకు పెద్ద ఎత్తున బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీసీసేన నాయకులు మల్లేశ్, విఠల్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు రవీందర్, భిక్షపతి, ఆంజనేయులు, సుధాకర్‌గౌడ్, ప్రభాకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంటకు మరమ్మతులెప్పుడో?



చుక్కనీరు లేక పిచ్చిమొక్కలతో ఎడారిగా దర్శనమిస్తున్న బాకారం ఎర్రకుంట

నెలరోజుల కురిసిన వర్షాలకు తెగిపోయిన కట్ట

- ప్రస్తుతం నీరు లేక పిచ్చిమొక్కలతో దర్శనం
- మరమ్మతులు నిర్వహించాలని రైతుల ఆవేదన

మొయినాబాద్‌రూరల్: రైతులకు ఉపయోగపడుతున్న చెరువులు, కుంటలను కాపాడాలని ప్రభుత్వం చెబుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కురిసిన వర్షాలకు వరద నీరు వృథాగా పోతోంది. నెలరోజుల క్రితం మండల పరిధిలోని బాకారం సమీపంలో గల ఎర్రకుంట గండిపడి తెగిపోయింది. దీంతో పూర్తిస్థాయి నీరు దిగువకు ప్రవహించింది. నీరు లేక ఆ కుంట పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. కుంట తెగినప్పుడు మండల అధికారులు, ఇరిగేషన్ డీఈతో పాటు పలువురు ఎర్రకుంటను పరిశీలించారు. వెంటనే ఈ కుంటకు మరమ్మతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నెలరోజులు అవుతున్నా మరమ్మతుల ఊసేత్తలేదు. ఇప్పటికైనా కుంటకు మరమ్మతులు నిర్వహించి నీరు నిలిచేలా చూడాలని చుట్టుపక్కల గ్రామాల రైతులు కోరుతున్నారు.



నెలరోజుల క్రితం గండిని పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు(ఫైల్)

నీరులేక వెలవెల

కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నా ఎర్రకుంట మాత్రం పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. చుక్క నీరు లేక వెలవెలబోయింది. కట్ట తెగిపోవడంతో కురుస్తున్న వర్షాలకు వరదనీటి ఉధృతికి వెంటనే తెగిపోయిన గండి నుంచి నీరు ఎప్పటికప్పుడూ వెళ్లిపోతుండడంతో ఎర్రకుంట పిచ్చిమొక్కలతో ఖాళీ స్థలంలా మారింది.

మరమ్మతులు చేయాలి



బాకారం ఎర్రకుంట గత నెలరోజుల క్రితం మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు గండిపడి తెగిపోయిన సంగతి తెలిసిందే. అప్పట్లో మండల అధికారులతో పాటు ఇరిగేషన్ జిల్లా అధికారి సందర్శించి పరిశీలించారు. కానీ ఇప్పటివరకు ఎర్రకుంట కట్టకు పడిన గండిపి పూడ్చలేకపోయారు. ఇప్పటికైనా కట్టకు మరమ్మతులు నిర్వహించి నీరు నిలిచేలా చూడాలి. కుంటలో నీరు చేరితే భూగర్భజలాలు పెరిగి రైతుల బోరుబావులు ఎండిపోకుండా ఉంటాయి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– కొత్తపల్లి తిరుపతిరెడ్డి, రైతు, బాకారం

గండిని పూడ్చేందుకు కృషి చేస్తున్నాం

మండల పరిధిలోని బాకారం సమీపంలోగల ఎర్రకుంట వర్షం వరద నీటికి తెగిపోయిన సంగతి అందరికీ తెలిసిందే. వర్షాలు భారీగా కురవడంతో గండిపడిన మాట నిజమే. కట్ట మరమ్మతుల కోస టెండర్ వేశాం. త్వరలో ఈ గండిని పూడ్చేందుకు కృషి చేస్తున్నాం.

– ప్రియాంక, ఇరిగేషన్‌ఏఈ, మొయినాబాద్

సెలవు రోజున తరగతులా?

- ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్



నిరసన తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: సెలవు రోజున తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని శ్రీచైతన్య, సత్యసాయి పాఠశాలలో బోధనా తరగతులు జరుగుతున్నాయని తెలుసుకున్న ఫెడరేషన్ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు.. పరిశీలించి బంద్ చేయించారు. పాఠశాల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం కూడా పాఠాలు బోధిస్తున్న అంశంపై గతంలో ఫిర్యాదు చేశామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. ఫీజు దోపిడీని అరికట్టాలన్నారు. ఆయా పాఠశాలలపై విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు చందు, రిషికిరణ్, అల్తాఫ్, జుబేర్, కైఫ్, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

షాబాద్: గ్రామాల అభివృద్ధికి యువజన సంఘాలు కృషి చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో కమిటీ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా చిల్కమర్రి విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్కకృష్ణ, మాజీ ఎంపీటీసీ అశోక్, బీజేపీ నాయకులు రాము, కృష్ణ, రాములు, వెంకటయ్య, ప్రదీప్, ప్రవీణ్, అనిల్, రత్నం, గోపి, సుధాకర్ పాల్గొన్నారు.

సురవరం జీవితం అందరికీ ఆదర్శనీయం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జంగయ్య

షాద్‌నగర్: సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని, ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని కూడలిలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సురవరం నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని, క్రమశిక్షణ కలిగిన నేతగా అంచలంచలుగా ఎదిగారని తెలిపారు. ఎర్ర జెండాను చేపట్టి కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కార్మికులు, కర్షకులు, నిరుపేదలకు అండగా నిలిచారని, వారి హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మహనీయుడి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, గోవింద్ నాయక్, లింగం నాయక్, రమేష్, రవి, నర్సింహ, ఆకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సురవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రోడ్ల అభివృద్ధితో గ్రామాల అనుసంధానం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

మొయినాబాద్ రూరల్: రోడ్ల అభివృద్ధితోనే గ్రామాలకు అనుసంధానం పెరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. మండల పరిధి నక్కలపల్లి గ్రామంలో ఎంపీ నిధులు రూ.ఐదు లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అధికారం చేపట్టిన అనతి కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మనన్నలు పొందిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజాపాలనను చూసి, ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక పోతున్నాయని, బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్‌భరత్, మండల అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ రాజు, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, మీనాజుద్దీన్, నాయకులు రవి, మల్లేశ్, శ్రీకాంత్, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధి అయ్యావారిపల్లి రోడ్డుకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో బీఆర్ఎస్ నేత వీరేశం మరమ్మతు పనులు చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామ శివారులో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో మాజీ ఎమ్మెల్యే సహకారంతో టిప్పర్ల ద్వారా మట్టిని పోయించి చదును చేయించారు. అయ్యవారిపల్లి, చించోడ్, భీమారం, దేవల్లి, ఉప్పరిగడ్డ గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలిగాయి.



మరమ్మతు పనులు చేయిస్తున్న నాయకులు